కథ

డా.కొఠారి వాణీ చలపతిరావు

# జీవన మంత్రం

ఆ ఇంట్లో ఆధిపత్యపోరు రావణకాష్టంలా ప్రతి రోజూ ప్రతీసారీ రగులుతూనే ఉంది. ఇక దానికి ఆరిపోవడం అంటూ ఎప్పటికీ ఉండదేమో. నాకు ప్రతిక్షణం టెన్షనే! మధ్య నాకెందుకు టెన్షన్ అంటే ఆ ఇంటి కోడలు మా అమ్మాయే కనుక.

ఈ రోజు ఉదయం కూడా ఫోన్ చేసి ఫోన్‌లోనే ఏడుపు. “అమ్మా! ఈ ఇంట్లో ఏ పని చేయటానికీ నాకు స్వేచ్ఛ లేదు. డోర్‌కర్టెన్స్ పాతవైపోయాయని షాప్‌కెళ్లి కొత్తవి కొనుక్కొచ్చాను. మధ్య హాల్లో అందంగా ఉంటుందని ఓ పూల కుండీ తెచ్చాను. మా అత్తగారు ఇక ఒకటే రాద్ధాంతం మొదలుపెట్టింది. నేను తనను అడక్కుండా ఏ పనీ చేయకూడదట. ఇష్టం వచ్చినట్టు డబ్బులు ఖర్చుపెట్టేశానట. మా అత్తగారు నన్ను అరుస్తుంటే మా మామగారూ ఎంటరైపోయి ‘నిన్ను నువ్వు ఏమనుకుంటున్నావ్ అసలు ఇంటికి పెద్దవాళ్లమైన మమ్మల్ని అడక్కుండా నీ ఇష్టం వచ్చినట్టు చేసుకుంటూ పోవటమేనా. మా అబ్బాయే మాతో సంప్రదించకుండా ఏ పనీ చేయడు. మధ్యలో వచ్చినదానివి అప్పుడే అంత కొమ్ములొచ్చేశాయా నీకు. ఎవరి ఇష్టమొచ్చినట్టు వాళ్లు ప్రవర్తించటం ఈ ఇంటి పద్ధతి కాదు. మా పిల్లల్ని మేం చిన్నప్పటి నుంచీ అలా పెంచాం’ అంటూ పెద్దగొంతుతో ఒకటే అరుపులు!” అంటూ చెప్పుకొచ్చింది.

ఏం మాట్లాడాలో నాకు అర్థం కాలేదు.

“ఈ అనవసర గొడవలేంటమ్మా! దానివల్ల నీకెంత మానసిక వత్తిడి! ఇప్పుడు ఆ కర్టెన్లు, ఫ్లవర్‌వాజ్ లేకపోతే ఏమయింది?” అన్నాను.

“నువ్వూ నన్నే అంటున్నావా?” అంది కోపంగా.

“అహ! అది కాదు. వాళ్ల ఇష్టప్రకారమే నడుచుకుంటే అసలు ఈ చికాకులే ఉండవుగా అని?”

“ఎప్పుడూ వాళ్ల ఇష్టమే నడవాలా ఇంట్లో? నాకు మాత్రం నా ఇల్లు.. నా వస్తువులు.. అని ఉండదా?”

“వాళ్లిద్దరూ ఒకటై అరుస్తుంటే మరి మీ ఆయన ఏమీ అనలేదా?”

“ఏమంటారు... ముప్పై ఏళ్లు వచ్చినా ఆయన ఇంకా అమ్మకూచే” అంది సుమ ఉక్రోషంగా.

దాని ఉక్రోషానికి, కోపానికి అర్థం ఉంది.

మా వియ్యపురాలు అదో రకం మనిషి! కొడుకుకు పెళ్లయితే చేసింది గానీ కోడలితో అతను సన్నిహితంగా ఉండటం చూసి సహించలేకపోతోంది. “అమ్మా..అమ్మా” అంటూ కొడుకు తన కొంగు పట్టుకుని తిరక్కుండా పెళ్లాం చుట్టూ ఎక్కడ తిరుగుతాడో అని భయం. వాళ్లిద్దరూ కలిసి స్కూటర్ మీద బజారుకు వెళ్లినా, సినిమాకో, షికారుకో వెళ్లినా ఆమె భరించలేదు. ఎలాగయినా ఆ ప్రయత్నాన్ని అడ్డుకోవటానికి శతవిధాలా ఆరాటపడుతుంది. “నువ్వెందుకు వాడు వెళ్లి వస్తాడులే. ఇంట్లో బోలెడు పనుంది” అనో, “నువ్వెందుకు వాడితో నేను వెళ్తాలే! ఏ వస్తువు ఎలాంటిది తేవాలో నీకు తెలియదు” అనో అంటుందిట.

అంతెందుకు పెళ్లయిన కొత్తలో... అర్ధరాత్రి పన్నెండు గంటల దాకా ఏదో వంకతో తన పక్కన కూర్చోపెట్టుకుని ఆ ముచ్చట ఈ ముచ్చట చెబుతూ.. కావాలని కొడుకును కోడలి గదిలోకి పోనీయకుండా చేసేదట’

మా వియ్యపురాలి మనస్తత్వం నాకూ చాలాసార్లు అనుభవానికి వచ్చింది. తను మగపిల్లాడి తల్లినన్న అహం ఆమె అణువణువులో ప్రతి మాటలో కనిపిస్తుంటుంది.

నేను ఎప్పుడు, వాళ్లింటికి వెళ్లినా ఆడపిల్ల తల్లిని..నన్ను చులకనగా చూస్తుంది.

నిజానికి అన్ని విషయాలలోనూ మా అల్లుడికన్నా మా అమ్మాయిదే పై చేయిగా ఉంటుంది. అందంలోను, చదువులోను, ఉద్యోగంలోనూ.. అయినా ఆడపిల్ల గనుక లోకువ!

నేను అక్కడ ఉన్న ఒక గంటో రెండు గంటలలో కావాలని తన కొడుకు ప్రస్తావన తెచ్చి “మా అబ్బాయి..”, “మా అబ్బాయి” అంటుంది. ‘సుమ’తో మాట్లాడుతున్నప్పుడూ అంతే! ఓ రోజు సుమకు వళ్లు మండి “మా ఆయన” అందిట. అంతే! రావణకాష్టం ఆ రోజంతా చిటపట మంటూనే ఉందిట.

నేను కనందే నీకు ‘మీ ఆయన’ వచ్చాడా? ముందు నా కొడుకు, ఆ తర్వాతే నీ మొగుడు! అత్తమామల ముందు నువ్వు ‘మా ఆయన’ అనకూడదు.. ‘మీ అబ్బాయి’ అనే అనాలి ! ఇంకోసారి అలా అనకు’ అని వార్నింగ్ ఇచ్చిందట.

“మా అమ్మ ‘నన్ను’ కంటేనే మీ అబ్బాయికి పెళ్లాం వచ్చింది. సంసారం చేయడానికి మొగవాడు ఎంత అవసరమో, ఆడదీ అంతే అవసరం” అని అందామనుకుంది గానీ ‘మాటకు మాట ఎదురుచెప్పావంటూ మళ్లీ వంద చదువుతుందని భయమేసి ఊరుకుందట. సుమకు కోపం తొందరగా వచ్చేస్తుంది. అదే నా భయం! ఆడపిల్ల అన్న తర్వాత అత్తవారింట సర్దుకుపోయే మనస్తత్వం అలవరచుకోవాలి. లేకుంటే కలహాలు, కన్నీళ్లు, అశాంతిలతో జీవితం దినదినగండం అవుతుంది. ప్రత్యక్ష నరకమవుతుంది. అందుకే సుమకు ఎప్పటికప్పుడు చెబుతూ ఉంటాను. జాగ్రత్తగా ఆచితూచి మాట్లాడమని, ఎవరు ఏం అన్నా పట్టించుకోకుండా మౌనంగా ఉండిపొమ్మని! అలా చెప్పి తల్లిగా నా బాధ్యత నేను నిర్వహించాననే అనుకున్నాను.

నిజానికి సుమను చూస్తుంటే జాలేస్తుంది నాకు. మా ఇంట్లో అది ఆడింది ఆటగా పాడింది పాటగా పెరిగి పెద్దయింది. అది ఏదడిగితే అది ‘లేదు’ ‘కాదు’ అనకుండా నిముషాల మీద తెచ్చిచ్చేవారు వాళ్ల నాన్నగారు. మా ఇద్దరమ్మాయిల్లో ఆఖరు పిల్ల అని సుమ అంటే అందరికీ గారాబం! అది ఎక్కడికి వెళ్లాలన్నా, ఏం చేయాలన్నా, ఏం కొనుక్కోవాలన్నా దానికి పూర్తి స్వేచ్ఛ ఉండేది.

అలా పెరిగిన పిల్ల అత్తారింటికి పోగానే ఎంత అస్వతంత్రురాలయింది! తన ఇంట్లోనే తనకు స్వేచ్ఛ లేదు. కుటుంబ సభ్యులే పరాయి వాళ్లలా ఒకసారి, శత్రువుల్లా మరోసారి ప్రవర్తిస్తున్నారు. నాలుగు గోడల మధ్య బందీలా, బానిసలా బతకవలసి రావటం ఆడదాని జీవితంలో ఎంత దుర్భరం!

కట్టుకున్నవాడు సైతం ‘కన్నవారు’ అనే పంజరంలో చిలుకలా బతుకుతుంటే... ఇక అతన్నే నమ్ముకుని వచ్చిన ఆమెకు దిక్కెవరు? తల్లిదండ్రుల పట్లే కాక భార్య పట్ల తనకు బాధ్యతలుంటాయని ఆమెను అలరించటం, ‘నీకు నేనున్నా’నని భరోసా ఇవ్వటం భర్తగా తను చేయాల్సిన పని అని గుర్తించకపోతే ఎలా? సుమ ఇంకా ఎన్నాళ్లిలా స్వేచ్ఛలేని బతుకు బతకాలి?’ అనుకున్నాను బాధతో.

‘మా అమ్మాయిని అలా అన్నారు.. ఇలా అన్నారు...ట’ అని నేను వెళ్లి మా వియ్యపురాలిని నిలదియ్యలేను. కనీసం సర్దిచెప్పలేను. వాళ్ల కుటుంబ విషయంలో తలదూర్చినట్టవుతుంది. కోడలి పుట్టింటి వారి జోక్యాన్ని కొంచెమైనా సహించగలరా వాళ్లు? ఆడపిల్ల పెళ్లి చేసి ఓ అయ్య చేతిలో పెట్టిన తర్వాత ‘ఆడ’పిల్ల అవుతుందే గానీ ‘ఈడ’పిల్ల కాదు కదా. కన్యాదానంతోనే కన్నకూతురి మీది సర్వ హక్కులనన్నింటినీ కోల్పోతారు కదా తల్లిదండ్రులు. దాని అత్తమామల మనసులు మారాలని, భర్త మనసులో దానిమీద ప్రేమ అంకురించాలనీ.. చేతులు జోడించి ఆ దేవుడిని ప్రార్థించటం తప్ప ఏమీ చేయలేనా నేను? దాని ముఖంలో ఆనందపు వెలుగు కోసం ఎన్నాళ్లని నిరీక్షించను నేను? అనుకున్నాను.

○○○

మా పెద్దమ్మాయి నవీన అత్తవారింటి నుంచి వచ్చింది. అది వచ్చిందని సుమ కూడా దాన్ని కలవటానికి వచ్చింది. చాలా రోజుల తర్వాత అక్కను చూడటానికి వస్తున్నానన్న సంతోషం, హుషారుకు బదులు దాని ముఖంలో కోపం, చిరాకు తొంగిచూస్తున్నాయి.

"ఏంటే అలా ఉన్నావ్?" అని అడిగింది నవీన చెల్లెల్ని.

"ఏముంది నా ప్రోబ్లమ్ మా అత్తగారు! మా అక్క ఊర్నించి వచ్చింది. మా అమ్మా నన్నూ రమ్మని ఫోన్ చేసింది. వెళ్తున్నాను అన్నాను. దాంతో వంద చదివింది ఆవిడ. 'పిలిచిన ఆవిడకు లేకపోయినా వెళ్లే నీకయినా వడం ధర్మమని నువ్వు చెప్పావు...'అలాగే వెళ్లిరా' అని అనివుంటే అత్తగారిలా ఆమె ధర్మం ఆమె నెరవేర్చినట్లుందేది. పెళ్లి కాగానే ఆడపిల్ల పుట్టింటిని, తల్లిదండ్రులను, తోబుట్టువులను మర్చిపోయి తమ ఇంటికే సొంతమైపోవాలనుకోవటం ఏం న్యాయం? తనకు మాత్రం పుట్టిల్లు ఉండాలి. పుట్టిల్లు ఊళ్లో ఉంది కదా అని చీటికీ మాటికీ పరుగెత్తడమేనా? మీ అక్క వస్తే ఏంటి...అంతగా చెల్లెల్ని చూడాలని ఉంటే తనే ఇక్కడికి వచ్చి చూసి వెళ్లాచ్చుగా...?' అంటూ ఒకటే నసుగుడు" అంది సుమ.

"అలా అందా? అయితే ఈసారి ఆవిడకు చెప్పకుండా వచ్చేసెయ్. ఇక్కడికే కాదు ఎక్కడికెళ్లినా చెప్పకు!" అంది నవీన ఠక్కున. ఊహించని ఆ మాటలకు ఆశ్చర్యంతో చటుక్కున నేను తలెత్తి చూస్తే, సుమ ఆనందంతో, ఉద్వేగంతో చూసింది.

"తమ పెద్దరికాన్ని నిలబెట్టుకోలేని పెద్దలకు అంతే చేయాలి? పెద్దవాళ్లకు చెప్పిరా లేదా.. తను మాత్రం అక్కడి నుంచి వచ్చింది కాదా?" అంది తీక్షణంగా.



"మా అత్తగార్కి ఆమె పుట్టింటి వాళ్లంటే ఎంత ప్రేమో తెల్సా అక్కా. అక్కచెల్లెళ్లు వస్తే ఆమె ఆనందానికి పట్టపగ్గాలు ఉండవు. పండక్కి తమ్ముడు రమ్మన్నాడు అనో అమ్మగార్ని, నాన్నగార్ని చూసి రావాలి అనో అడపాదడపా ఇల్లు నాకు వప్పచెప్పి తను పుట్టింటికి చెక్కేస్తూనే ఉంటుంది" అంది సుమ.

"చూశావా మరి? కొందరంతే..ఎదుటివాళ్లను విమర్శించే ముందు 'మేమేమిటి?' అని వాళ్లలోకి వాళ్లు తొంగి చూసుకోరు"

"మా ఇంటి పెత్తనమంతా మా అత్తగారిదే అక్కా! ఆమెకు వంతపాడుతూ మా మామగారు. వాళ్లిద్దరూ ఒకటై మా ఇద్దర్నీ పరాయివాళ్లుగా చూస్తారు. నన్నయితే మరీ! ఇక మా వారినయితే చీటికీ మాటికీ 'పెళ్లాం తప్ప నీకు మేం కనబడం' అది మరీ నిన్ను ఆడిస్తోంది. కన్నవాళ్లం నీకు కాని వాళ్లమయ్యాం' అంటూ ఒకటే సాధిస్తారు. ఆయన అటు వాళ్లకు చెప్పలేక ఇటు నాకు చెప్పలేక నలిగిపోతుంటారు పాపం!"

"పాపమా... ఎందుకంత జాలిపడుతున్నావ్? నువ్వ

నుకున్నట్టు ఆయనేం నలిగిపోవటం లేదు. అమ్మను ఎదిరించే ధైర్యం లేక భర్తగా నీ పట్ల తన బాధ్యతలను విస్మరిస్తూ బానిసలా బతుకుతున్నాడు ఆ ఇంట్లో. 'పెళ్లాంతో మాట్లాడితే అమ్మ ఏమనుకుంటుందో. పెళ్లాన్ని సమర్థిస్తే నాన్న ఏమనుకుంటాడో' అనే భయంతో పిరికి బతుకు బతుకుతున్నాడు. ఏం... పెళ్లి చేసుకుని పెళ్లాన్ని ఇంటికి తీసుకెళ్లి తినటానికి ఇంత అన్నం పెట్టగానే తన బాధ్యత తీరిపోయిందనుకున్నాడా? తన వాళ్లనందరినీ వదిలిపెట్టి నామీదే ఎన్నో ఆశలు, ఎంతో నమ్మకం పెట్టుకుని వచ్చిన ఇల్లాలికి నా ఇంట్లో ఎలాంటి స్థానాన్ని, గౌరవాన్ని ఇస్తున్నాను? అని తనను తాను ఎప్పుడయినా ప్రశ్నించుకుని ఉంటాడా...ఉండదు! ఉంటే అలా ప్రవర్తించడు. తన తల్లి నిన్ను ఏదయినా అన్నప్పుడు 'అమ్మా! సుమ నా భార్య. నా భార్యను నువ్వు అవమానిస్తే నన్నూ అవమానించినట్లే! కొడుకుగా మీ పట్ల నాకు కొన్ని బాధ్యతలున్నట్లే, భర్తగా ఆమె పట్లా నాకు కొన్ని బాధ్యతలున్నాయి! వాటిని నన్ను సక్రమంగా నిర్వర్తించుకోవటానికి దయ చేసి మీరు అడ్డుపడకండి' అని ఎందుకు చెప్పడు మీ ఆయన?" గుక్కతిప్పుకోకుండా మాట్లాడుతోంది నవీన.

సుమ మంత్రముగ్ధయై ఆ మాటలను వింటోంది. ఇక నేనయితే నన్ను నేను మర్చిపోయాను. ఆ ఆలోచనా విధానం, ఆ తరహా మాటలు నాకు కొత్త కావటంతో మరో లోకంలో ఉన్నట్టుగా ఉంది నా మనఃస్థితి.

"సుమా! ఒక్క విషయం గుర్తుంచుకో. కుటుంబ సభ్యులంటే స్నేహితుల్లా, పరస్పర శ్రేయోభిలాషుల్లా ఉండాలి. ఏ విషయాన్నయినా, ఏ సమస్యనయినా సామరస్యంతో అంతా కలిసి మాట్లాడుకుని, చర్చించుకుని నిర్ణయాలు, పరిష్కారాలు ఎంచుకోవాలి. అంతేగానీ ఆధిపత్యభావంతో పెత్తనం చెలాయిస్తూ ఎదుటివాళ్లను శాసించే అధికారం ఎవ్వరికీ లేదు" అంది నవీన.

సుమ సంతోషం అంతా ఇంతా కాదు.

"ఎంత బాగా చెప్పావక్కా..అమ్మ ఎప్పుడూ నాకు ఇలా చెప్పలేదు. ఎప్పుడూ 'సర్దుకుపోవాలమ్మా..' అంటూ నాదే తప్పన్నట్లు మాట్లాడుతుంది" అంది సుమ నా వంక చూస్తూ.

దాంతో నవీన కూడా నా వంక తిరిగింది.

"సర్దుకుపోవాలి... నిజమేనమ్మా. కానీ దానికీ ఒక లిమిట్ ఉంటుంది. జీవితాంతం సర్దుకుపోతూ సహిస్తూ మౌనంగా భరిస్తూ ఉండిపోతే వయసు, కాలం గడిచిపోయిన తర్వాత ఇంక ఎప్పుడమ్మా అనుభవించేదీ ఆనందించేదీ. అరవై యేళ్లు వచ్చిన వృద్ధ దంపతులు ఒకే మాటగా, ఒకే బాటగా, ఒకళ్లనొకళ్లు సమర్థించుకుంటూ వెనకేసుకొస్తూ తమ కళ్ల ముందే అన్యోన్యంగా ఉంటుంటే..ఆ ఇంట్లోనే ఉంటున్న యువజంటకు మాత్రం అలా ఉండాలని ఉండదా?" అని అడిగింది.

నిజమేననిపించింది నాకు.

"అమ్మా! నా పెళ్లయిన కొత్తలో కూడా నువ్వెప్పుడూ ఒక మాట నాతో చెబుతూ ఉండేదానివి. ఆడపిల్ల పెళ్ల తర్వాత 'ఆడ' పిల్లనే! కష్టమయినా, సుఖమైనా ఇక తప్పదు అని! ఇప్పుడు కాలం మారిందమ్మా. ఆడపిల్ల పెళ్లి చేసి బాధ్యత తీరిపోయిందని చేతులు దులుపుకుని ఇక నీ అదృష్టం..నీ ఖర్మ.. ఎలా ఉంటే అలా జరుగుతుంది అని తల్లిదండ్రులు అనుకుంటే.. అమ్మా! అనుభవంతో చెబుతున్నాను..నీ కూతురు అత్తింట్లో దిక్కులేనిదవుతుందమ్మా.." అన్న ఆ ఆఖరు మాటలకు ఉలిక్కిపడి ఒక్క ఉదుటున నేను తలెత్తి నవీన వంక చూశాను.

దాని కళ్లల్లో...కన్నీళ్లు!

"కంగారు పడకమ్మా. ఇప్పుడు నేను సుఖంగా, సంతోషంగానే ఉన్నాను. ప్రమాదం అంచువరకూ వెళ్లి అకస్మాత్తుగా తెలివిన పడి నా అనుభవాలే నాకు నేర్పిన పాఠాలతో పోరాడి నా హక్కులను నేను సంపాదించుకున్నాను. ఎవరి ఆధీనంలోకో వెళ్లబోతున్న నా సంసారాన్ని నేర్పుతో నేను తిరిగి పొందగలిగాను. ఆ సమయంలో నా తెలివి, తెగింపు పనిచేయకుంటే ఈ రోజు ఈ నీ పెద్దకూతురు..ఇలా నీ కళ్ల ముందు ఉండేది కాదమ్మా"

నాలో దుఃఖం పొంగుకుని వచ్చింది.

ఒక్క అంగతో నవీన పక్కకు వెళ్లి ఆప్యాయంగా దాని భుజం మీద చెయ్యి వేశాను.

సుమ అప్పటికే అక్కను ఆత్మీయస్పర్శతో ఊరడిస్తోంది.

"కూతురి సంసార జీవితంలో పుట్టింటివాళ్ల ప్రమేయం మంచిది కాదు. నిజమే. కానీ అది కొంతవరకే అమ్మా. తన కూతురు సుఖానికి, సంతోషానికి, అస్తిత్వానికి, ప్రాణానికి అత్తింట్లో ముప్పు వాటిల్లబోతున్న పరిస్థితిలో కన్నవాళ్లు రంగప్రవేశం చేసి 'నీకు నేనున్నానని' తను కన్న తన సంతానానికి భరోసా ఇవ్వాలమ్మా. నా కూతుర్ని మీ చేతుల్లో పెట్టింది దాన్ని మీ కోడలిగా చేసుకుని ఇల్లాలి హోదాను కల్పించమని గానీ దాన్ని సతాయించమని కాదు అని నిలదీసి అడగొచ్చునమ్మా" అంది నవీన గుండెను మెలిపెట్టే బాధతో.

ఇంతవరకూ నేను 'సుమ'కు చేసిన హితబోధను ఇప్పటి నవీన మాటలతో పోల్చి చూసుకుంటే తరాల అంతరం నా మనసుకు స్పష్టంగా కనిపించింది. అక్క మాటలతో సుమలో ఎక్కడలేని హుషారూ వచ్చేసింది అప్పటికే.

"అక్కా..ఇంక నువ్వేం చెప్పకు. నువ్వు చేసిన ఈ మంత్రోపదేశంతో ఇంక నా జీవితం నా చేతుల్లోనే నాకు అత్యంత సమీపంలోనే ఉంది. పరాధీనం కాలేదని, ఇక ముందు కానివ్వనని స్పష్టమైన అవగాహన నాకు కలిగింది" అంది సుమ తనకు తానే కొండంత అండగా ఫీల్ అవుతూ.

ఈ కాలం పిల్లలయిన నా కూతుళ్ల వంక గర్వంగా చూసుకున్నాను నేను.

## అశిన్ అదృష్టం

ఆమీర్ ఖాన్‌తో హిందీ గజినీలో నటిస్తున్న అశిన్ అప్పుడే బాలీవుడ్ సినీజనాల దృష్టిని ఆకట్టుకుంటోంది. ఆమెని హీరోయిన్‌గా తీసుకోడానికి చాలా మంది నిర్మాతలు ఇంటరెస్ట్ చూపిస్తున్నారట. వాటిలో చెప్పుకోదగిన ఆఫర్ ఒకటుంది. అమితాబ్ కూతురు శ్వేత నిర్మాతగా మారుతూ ఓ హిందీ సినిమా తీయడానికి సన్నాహాలు చేస్తోంది. ఇందులో నాయికగా అశిన్‌ని తీసుకోవాలని ఆమె అనుకుంటున్నట్టు బాలీవుడ్ సినీవర్గాల సమాచారం. ప్రముఖుల దృష్టిలోకి వస్తున్న అశిన్ తన మకాంని పూర్తిగా ముంబాయికి మార్చే వుద్దేశంలో వుందిట.

